క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణలో పీవోల పాత్ర కీలకం

• కలెక్టర్ నాగలక్ష్మి



పీవోలు, ఏపీవోలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం సిటీ: ఎన్నికల నిర్వహణలో పీవోల పాత్ర చాలా కీలకమని, ప్రస్తుతం ఎన్నికల విధులకు సంబంధించి, ఇస్తున్న శిక్షణలో నేర్పిస్తున్న ప్రతీ అంశాన్ని చక్కగా నేర్చుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల పీవోలు, ఏపీవోలకు ఇస్తున్న మూడో విడత ఎన్నికల శిక్షణను ఆమె గురువారం పరిశీలించారు. శిక్షణలో నేర్పిస్తున్న అంశాల్లో దేనిలోనైనా సందేహాలు ఉంటే వాటిని ఇక్కడే నివృత్తి చేసుకోవాలన్నారు. ఇక్కడ నేర్పించే అంశాలు ఎన్నికలు పక్కాగా నిర్వహించేందుకు దోహదపడతాయన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, నిర్ణీత సమయానికి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని తెలిపారు. అంతకుముందు పోలింగ్ ఏర్పాట్లపై ఆర్వో జోసెఫ్, ఏఆర్వో ఎస్.కె. రాజులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికలప్పుడు ఎటువంటి వివాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

సీఎం జగన్‌తోనే మహిళల ఆర్థికాభివృద్ధి



వన్నలిలో ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు తదితరులు

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించగలరని వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సారోతు సుభాషిణి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని వన్నలి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రదేశానికి వారు గురువారం వెళ్లి, అక్కడి మహిళలతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ ఐదేళ్ల ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అనేకానేక సంక్షేమ పథకాలు అందజేసి, ప్రభుత్వం ప్రోత్సహించిందన్నారు. మహిళలు మరింతగా అభివృద్ధి చెందాలన్నా, ఇప్పుడున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యే. ఎంపీలుగా పోటీ చేస్తున్న తలే రాజేష్, బెల్లాన చంద్రశేఖర్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులు ఇబ్బందులు పడకుండా చర్యలు



ఎస్‌బీఐ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

రామభద్రపురం: సామాజిక పింఛన్‌ల నగదు కోసం బ్యాంకులకు వచ్చే వారు ఇబ్బందులు పడకుండా బ్యాంకుల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సూచించారు. ఇదే విషయమై స్థానిక ఎస్‌బీఐ మేనేజర్‌ను గురువారం కలిసి మాట్లాడిన ఆమె.. మండలంలోని అన్ని బ్యాంకులతో పాటు బీసీ పాయింట్ల వద్ద లబ్ధిదారులకు మే నెల పింఛన్ అందిస్తున్నారని, వేసవి ఎండల నేపథ్యంలో డబ్బులు తీసుకునేందుకు వస్తున్న వారికి తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే ఎండలో ఎక్కువసేపు క్యూలైన్‌లో నిల్చొనే సందర్భాలు ఉన్నచోట టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గడిముడిదాం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని కంచరాం, ఆగూరు, దోసరి, గడిముడిదాం తదితర గ్రామాల్లోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద కల్పించిన మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. పోలింగ్ రోజున అన్ని కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేయాలని, ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని బీఎల్‌వోలకు సూచించారు.

వలంటీర్ల రాజీనామా

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న గ్రామ వలంటీర్లంతా గురువారం రాజీనామా చేశారు. అనంతరం తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. తామంతా స్వచ్ఛందంగా రాజీనామా చేశామని, మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రజాప్రభుత్వానికి మద్దతివ్వండి

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బొబ్బిలిలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగికి ఘనస్వాగతం పలికిన పట్టణ ప్రజలు

బొబ్బిలి: ప్రజాప్రభుత్వమైన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లోనూ మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక పట్టణంలోని 5, 6వ వార్డుల్లో గురువారం పర్యటించిన ఆయనకు ఆయా వార్డుల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ప్రజల్లో తిరిగి వారి కష్టాలను తెలుసుకుని, ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కష్టాలను తీర్చారన్నారు. అన్నివర్గాల్లోని ప్రజలకు లబ్ధి చేకూరేలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. అన్నిప్రాంతాలు బాగుండేలా ప్రతీ గ్రామసచివాలయం పరిధిలో ప్రజల మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఓటమి భయంతోనే చంద్రబాబు మరో రెండు పార్టీలతో జతకట్టారని విమర్శించారు. ఎన్నికల వేళ వారు చెప్పే మాయమాటలు నమ్మి, మరోసారి మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. నిత్యం రాష్ట్రం, ప్రజల బాగోగులు కోరుకునే సీఎం జగనన్ననే మళ్లీ మనమంతా ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు రెండూ ఫ్యాన్ గుర్తుకే వేసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా పోటీలో ఉన్న బెల్లాన చంద్రశేఖర్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శంబంగి శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాదంగి: రానున్న సార్వత్రిక ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధంగా భావించాలని, పేదల పక్షపాతి ప్రభుత్వమైన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని రావివలస, గదబవలస, గూడెపువలస, ఆకులకట్ట, డి.వి.పేట, రామచంద్రాపురం, పిన్నవలస గ్రామాల్లో పర్యటించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని, అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. ఎన్నికల వేళ మాయమాటలతో మన వద్దకు వచ్చే టీడీపీ నేతలను నమ్మవద్దన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకే ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు రెండూ వేసి, తనను ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.కాశినాయుడు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఎస్.శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటనాయుడు, జెడ్పీటీసీ పి.రామారావు, ఎంపీపీ బి.గౌరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



బొబ్బిలి: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి



బాడంగి: గూడెపువలసలో టీడీపీ నుంచి పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంబంగి



రేగిడి: బూరాడలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారిని సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణరాజు

బొబ్బిలి: ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని పక్కి గ్రామంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు స్వగృహం వద్ద తెర్లాం మండలంలోని మోదుగువలస గ్రామ మాజీ సర్పంచ్ రెడ్డి కృష్ణ తన అనుచరులతో కలిసి టీడీపీని వీడి, వైఎస్సార్ సీపీలో గురువారం చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి, సాదరస్వాగతం పలికారు. పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. తామంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులమై, పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగనన్న సర్కారును మరోసారి అధికారంలో నిలబెట్టేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్డి దాలినాయుడు, ఈదుబిల్లి వెంకటనాయుడు, రెడ్డి నవీన్, గులిపిల్లి గణేష్, సీరాపు భాస్కరరావు, రేగిడి రేగయ్య, వాసానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని గూడపువలస గ్రామానికి చెందిన 17 కుటుంబాల వారు టీడీపీని వీడి, వైఎస్సార్ సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ గ్రామానికి గురువారం వెళ్లిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సమక్షంలో వారంతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి, స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారిలో చల్ల సత్యం, కృష్ణ, వెంకటనాయుడు, అప్పలస్వామి, రామినాయుడు, సత్యం, సత్యనారాయణ, దామోదర్, రావిపల్లినారాయణ, సోములు, ఎస్.నారాయణ, చినపూడి అప్పలస్వామి, దేవతోటి తాడు, తియ్యల పాపారావు, లక్ష్మణ, ముదునూరు తిరుపతిరాజు తదితరులు ఉన్నారు.

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. టీడీపీకి చెందిన 50 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో గురువారం చేరారు. రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు తదితరులు వారందరికీ పార్టీ కండువాలు వేసి, ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎస్.చిన్నప్పలనాయుడు, ఎస్.దాలినాయుడు, ఎస్.విశ్వేశ్వరరావు, శీర రాము, శీర శ్రీనివాసరావు, రెడ్డి మీనాలతో పాటు తదితర కుటుంబాల వారు ఉన్నారు.

బూత్ కన్వీనర్లు ప్రధాన పాత్ర వహించాలి

రాజాం: ఎన్నికల ప్రచారంలో బూత్ కన్వీనర్లు ప్రధాన పాత్ర వహించాలని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించాలని వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బూత్ కన్వీనర్లతో గురువారం సమావేశమైన ఆయన ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో పార్టీ తరఫున ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేయాలన్నారు. టీడీపీ దుష్ప్రచారాలను తిప్పికొడుతూనే సీఎం జగనన్న చేసిన మంచిని తెలపాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బి.నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు వై.వెంకటేష్, ఎన్.వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

బొబ్బిలి: ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించి, స్థానిక వేణుగోపాల ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ తెలిపారు. ఇదే విషయమై ఆమె విలేకరులతో గురువారం మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లు చేపడుతున్నామని, తొలుత ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్లను పొందుపరిచే ప్రక్రియను చేపడుతున్నామన్నారు. ఈ నెల 7వ తేదీన నియోజకవర్గంలోని మొత్తం ఆరుగురు ఓటర్లకు సంబంధించి, హోమ్ ఓటింగ్ చేపట్టనున్నామన్నారు. ఈ నెల 8వ తేదీన ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తామన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

రామభద్రపురం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని సీఐ తిరుమలరావు కోరారు. మండలంలో గుర్తించిన సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లోని పెద్దలు, గ్రామస్తులతో గురువారం సమావేశమైన ఆయన.. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాలను గుర్తించి, ఆయా చోట్ల శాంతియుత ఎన్నికలే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గొడవలు పడకుండా పోలీసులకు సహకరించాలన్నారు.

సీఎం జగన్ పాలననే ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారు..

• ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



రేగిడి: ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలోని అన్నివర్గాలకు మేలు అని, ఆయన పాలననే ప్రజలు మళ్లీ మళ్లీ కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని ఉనుకూరు, పోరాం, వప్పంగి, కాగితాపల్లి, పారంపేట, పనసలవలస, బాలకవివలస, మునకలవలస, తోకలవలస, లక్ష్మణవలస, తాటిపాడు, బూరాడ గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అన్నివర్గాల ప్రజలు, అన్నిప్రాంతాలు బాగుండాలన్నదే సీఎం జగనన్న తపన అని, అందుకే ఆయన అనేకానేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు, కార్యక్రమాలు చేపట్టారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామస్తుల వద్దకే ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించారని, అలాగే వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందజేశారన్నారు. ఎన్నికల వేళ బూటకపు హామీలు, మాయమాటలతో వస్తున్న టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు రెండూ వేసి, తనను ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టి.అచ్చెన్నాయుడు, మండల అధ్యక్షుడు జగన్‌మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టండి

• వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రాజాం: ప్రభుత్వంపై టీడీపీ కూటమి నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదే విషయమై మండల కేంద్రంలో విలేకరులతో గురువారం మాట్లాడిన ఆయన.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఎన్నో సంస్కరణలు, విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, ప్రజలకు సుపరిపాలన అందించారన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే పరమావధిగా ఆయన కొనసాగించిన పాలన దేశానికే ఆదర్శమన్నారు. ఆయన పాలనా విధానాలు నచ్చడంతోనే తమలాంటి వారమంతా పార్టీలో చేరామన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరిట టీడీపీ అధినేత చంద్రబాబు అండ్ కో.. లేనిపోని అసత్యాలతో ప్రజలను ఆందోళనకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని, ఇదంతా వారు కేవలం రాజకీయ లబ్ధి పొందేందుకే చేస్తున్నారన్న విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. కేంద్రం చేసిన ఈ చట్టాన్ని రాష్ట్రంలో ఇంకా అమలు చేయలేదని, అమలు సాధ్యాసాధ్యాలపై ఆలోచన దశలోనే ఏకంగా చట్టం అమలైపోయిందని, ఆ చట్టంతో ప్రజలు భూములు కోల్పోతారన్న విష ప్రచారం చేయడం తగదన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, రేగిడి వైస్ ఎంపీపీ టి.అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వి.జగన్మోహనరావు పాల్గొన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు



తెర్లాంలోని బీసీ పాయింట్ వద్ద పెన్షన్ డబ్బుల కోసం వేచి ఉన్న పింఛన్‌దారులు



తెర్లాం ఎస్‌బీఐ వద్ద పెన్షన్ డబ్బుల కోసం లబ్ధిదారులు పడిగాపులు



బాడంగి: పింఛన్ డబ్బుల కోసం మండల కేంద్రంలోని బీసీ పాయింట్ వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు



రామభద్రపురంలో ఎస్‌బీఐ బీసీ పాయింట్ వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు

పింఛన్ల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారు. గురువారం ఉదయం మండల కేంద్రాలకు వెళ్లి, బ్యాంకుల వద్ద గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొన్నారు. మే నెల పింఛన్‌ను బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని ఎన్నికల కమిషన్, ఏపీ సీఎస్‌లను టీడీపీ కోరగా, ఈ మేరకు బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదును జమచేశారు. దీంతో డబ్బులు తీసుకునేందుకు బ్యాంకులు, బీసీ(బ్యాంక్ కరెస్పాండెంట్) పాయింట్ల చుట్టూ లబ్ధిదారులు తిరుగుతున్నారు. బీసీ పాయింట్లలో డబ్బులు తీసుకునేందుకు రూ.వెయ్యికి రూ.10 చొప్పున రూ.3 వేలకు రూ.30 చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ వలంటీర్లు ఉన్నప్పుడే బాగుండేదని, చంద్రబాబు కారణంగా గత నెలలో సచివాలయాల చుట్టూ, ఈ నెలలో బ్యాంకుల చుట్టూ పింఛన్‌ల కోసం తిరగాల్సిన దుస్థితి తలెత్తిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్.

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి

ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ వైఎస్సార్ సీపీ నేతలు ప్రచారంలో జోరు పెంచారు. గురువారం జరిగిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లిన నాయకులు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నేతలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడం విశేషం. – సాక్షి నెట్‌వర్క్.



రామభద్రపురం: సోపురంలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులకు హారతులిచ్చి, స్వాగతం పలుకుతున్న మహిళలు



రాజాం సిటీ: సారధిలో ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ సతీమణి మాధవీలత తదితరులు



వంగరలో ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ సురేష్ ముఖర్జీ తదితరులు



రాజాం సిటీ: రాజయ్యపేటలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ మహిళా నేతలు



తెర్లాం: ఆమిటిలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నేతలు

చంద్రబాబు, పవన్‌లను నమ్మొద్దు

• ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



కొండలింగాలవలసలో ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు

మెంటాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని, అధికారం కోసం మోసపూరిత హామీలతో ప్రజల ముందుకు వస్తున్న టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను నమ్మవద్దని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కొండలింగాలవలస, చింతాడవలస, జక్కువ, పెదచామలాపల్లి, పెదమేడపల్లి, కుంటినవలస గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించారు. రాష్ట్రంలోని అన్నిప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్ తపన అని, ఆ దిశగా ఆయన ఐదేళ్ల పరిపాలన కొనసాగిందని, ప్రజలు కూడా ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ఎన్నికల వేళ మళ్లీ బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, ఎమ్మెల్యేగా మరోసారి పోటీ చేస్తున్న తనను గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, పార్టీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.